క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



నూజెండ్ల: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన బాల్య విద్యను అందించాలని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌భీ, పడాయిభీ శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో అనురాధ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్యను అందించాలన్నారు. పిల్లలందరూ పాఠశాలకు వెళ్లడానికి సంసిద్ధత చేయాలన్నారు. నాణ్యమైన బాల్య విద్యను బోధించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. సూపర్‌వైజరు ఇన్నాశమ్మ పాల్గొన్నారు.

గోగులపాడులో పర్యటించిన ఆర్డీఓ



రొంపిచర్ల: మండలంలో గోగులపాడు గ్రామంలో గురువారం నరసరావుపేట ఆర్డీఓ మధులత పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పొలాల రీ సర్వే పనులను పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా వారి పొలాలను సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ముందస్తు సమాచారము తెలియ జేసి రీ సర్వే చేయాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.నిర్మల, వీఆర్‌ఓలు నాయక్, అబ్బిరెడ్డి, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మున్సిపాలిటీ మీటింగ్ హాల్‌లో వినుకొండ క్లస్టర్ ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారంపాండ్, ఇంకుడు గుంతలు, ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడం, సరాసరి వేతనం, క్యాటిల్ షెడ్స్, శ్రమశక్తి సంఘాలు, హౌసింగ్ 90 రోజుల పని దినాలు, ఉద్యాన వన పంటలు, లేబర్ బడ్జెట్ తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో ఏపీడీ భూసిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంచాలి

చిలకలూరిపేట: చిన్నారుల్లో సృజన పెంచేలా అంగన్‌వాడీ టీచర్లు పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డీఆర్‌పీలు జి.విజయకుమారి, ఎస్ భూలక్ష్మి చెప్పారు. మండలంలోని కావూరు గ్రామం జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్‌భీ, పడాయిభీ కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్ల లోపు బాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తే వారిలో సృజనాత్మకత అలవడుతుందని పేర్కొన్నారు. శిక్షణకు 45 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.

గణపవరంలో పోషణ్ భీ.. పఢాయీ భీ కార్యక్రమం



నాదెండ్ల: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ, పఢాయీ భీ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన నిర్వహించారు. సీడీపీవో శాంత కుమారి మాట్లాడుతూ, అంగన్‌వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పీపీ1, పీపీ2 విద్యాబోధనలో నూతన ఒరవడితో విద్యను అందించాలన్నారు. పోషకాలతో కూడిన సమతులాహారం, చక్కటి విద్యాభ్యాసంలో ఆరోగ్యంగా విద్యావంతులుగా ఎదిగేలా చిన్నారులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వీడియో ద్వారా విద్యాబోధనపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సెక్టార్‌సూపర్‌వైజర్ పార్వతి, ఎ.ఉషారాణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు.. ఆదాయానికి గండ్లు

- అనధికార లేఔట్లతో ప్రభుత్వానికి, ప్రజలకు నష్టం
- పుడా ఆదేశాలతో అనధికార లేఔట్లపై కొరడా
- ప్లాట్ల హద్దురాళ్లను తొలగించిన పంచాయతీ సిబ్బంది



అనధికార లేఔట్ల వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, సచివాలయ సిబ్బంది

నాదెండ్ల: రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభార్జనే లక్ష్యంగా నిబంధనలను తుంగలో తొక్కి వెంచర్లు వేసి ప్లాట్ల క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. అనధికార లేఔట్లు వేసి ప్లాట్ల విక్రయాలతో జేబులు నింపుకుంటూ ఇటు ప్రభుత్వానికి, అటు ప్లాట్ల కొనుగోలుదారులకు నష్టం కలిగిస్తున్నారు. వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చేస్తున్నారు. కనీసం 30 అడుగుల వెడల్పు రోడ్లు ఉండాల్సి ఉన్నా కేవలం 15–20 అడుగుల రోడ్లను వేసి ప్లాటింగ్ చేసి ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆదాయ వనరుల అన్వేషణలో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలను పెంచారు. దీంతోపాటూ అనధికార లేఔట్లను నియంత్రించి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గత కొద్దిరోజులుగా చిలకలూరిపేట నియోజకవర్గంలో అనధికార లేఔట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.

గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని అనధికార లే ఔట్లపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రెండు రోజులుగా పంచాయతీ కార్యదర్శి మారుతి బాబు, సచివాలయ సిబ్బందితో కలిసి చిలకలూరిపేటలోని ఏఎంజీ సమీపంలోని శివ ప్రియనగర్ పక్కన గల సర్వే నెం.441, 443, 445–1ఎ4, 1ఎ5, 1బి2, 1బి3 నందలి య.17.65 సెంట్ల విస్తీర్ణంలో వేసిన ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. తొలగించిన హద్దురాళ్లను ట్రాక్టర్‌లో పంచాయతీ కార్యాలయానికి తరలించారు. గతంలో ఈ ప్రాంతంలో నరసరావుపేట పుడా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోమని పంచాయతీ అధికారులకు సూచించిన విషయం తెలిసిందే.

యథేచ్ఛగా..

రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలంటే ముందుగా భూమి కొనుగోలు చేసిన వ్యాపారి వ్యవసాయ



హద్దురాళ్ళను తొలగించి తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. లేఔట్ ప్లాన్ సిద్ధం చేసి కమ్యూనిటీ అవసరాలకు 10 శాతం స్థలాన్ని స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయాలి. 30 అడుగులకు తగ్గకుండా వెడల్పుతో రోడ్లను ఏర్పాటు చేయాలి. పుడా టెక్నికల్ అప్రూవల్ తీసుకొని అనంతరం సైడు కాల్వలు, ఇంటర్నల్ రోడ్లు, పైపులైన్ల ద్వారా నీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం కల్పించాలి. అనంతరం స్థానిక సంస్థలు, పుడాకు నిర్దేశిత ఫీజులను చలానా రూపంలో చెల్లించి అనుమతులు పొందాలి.

లేఔట్ పర్మిషన్ పొందిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఇళ్లు నిర్మించుకునేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. అనుమతి పొందిన లేఔట్‌లలో ఇళ్ల నిర్మాణానికి సులభంగా ప్లాన్లు జారీ చేస్తారు. అంతేకాక బ్యాంకు లోన్లు తదితరాలకు ఆటంకాలు ఉండవు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనధికార వెంచర్లు వేస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు నష్టం కలిగిస్తున్నారు. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలుదారులు ఇళ్ల నిర్మాణానికి పలు ఆటంకాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్లాన్లు పొందేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవటంతో పాటూ బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది.

కొనుగోలు చేయొద్దు



అనధికార లేఔట్లపై చర్యలు తీసుకోవాలని పుడా అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. గత రెండురోజులుగా సచివాలయ సిబ్బందితో కలిసి అనధికార లేఔట్లలో వేసిన హద్దురాళ్ళను తొలగిస్తున్నాం. ఇలాంటి ప్లాట్లు కొనుగోలు చేయకుండా ప్రజలు జాగ్రత్త వహించాలి. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన లేఔట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలి.

–ఎస్ మారుతిబాబు, పంచాయతీ కార్యదర్శి.

విద్యుత్ మీటర్ల తనిఖీలు

నరసరావుపేట: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో గురువారం విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగంకు చెందిన అధికారులు, సిబ్బంది విస్తృతంగా విద్యుత్ మీటర్ల తనిఖీలు నిర్వహించి చౌర్యానికి పాల్పడుతున్న వారి నుంచి రూ.6.47 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఆపరేషన్, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సీహెచ్.రాంబొట్లు, సీహెచ్.వెంటేశ్వరరావు వివరాలను తెలియచేశారు. జిల్లా పర్యవేక్షక ఇంజనీరు పి.విజయకుమార్ ఆదేశాల మేరకు మొత్తం 48 మంది అధికారులు, 153 మంది సిబ్బంది 48 బృందాలుగా ఏర్పడి 2806 సర్వీసులను తనిఖీ చేయటం జరిగిందన్నారు. మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యం చేస్తున్న ముగ్గురిని గుర్తించి వారి నుంచి రూ.3 వేలు, మీటరు ఉన్నా అక్రమంగా చౌర్యం చేస్తున్న ముగ్గురి నుంచి రూ.50 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీల్లో విద్యుత్ వాడుతున్న ఇద్దరికి రూ.15 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 150 మందికి రూ.5.79 లక్షలు విధించామన్నారు.



దాడుల్లో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ వినియోగదారులు అందరూ తమ మీటర్లకు సీలు ఉండేలా చూసుకోవాలని కోరారు. విద్యుత్ చౌర్యమనేది సామాజిక నేరంగా పరిగణించటం జరుగుతుందని, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 94408 12263, 94408 12360లకు నేరుగా కాని వాట్సాఫ్‌ల ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చన్నారు. దాడుల్లో డీఇఇ కె.రవికుమార్, జీఎల్‌వీ ప్రసాదరావు, ఏఇలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖరరావు, కేవీ నాగసురేంద్ర పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంపొందించండి

ఐసీడీఎస్ సీడీపీవో

బొల్లాపల్లి : చిన్నారుల్లో సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ఆమె ప్రారంభించారు. ఈపూరు ప్రాజెక్టు పరిధిలోని ఈపూరు, వెల్లటూరు గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణలో భాగంగా తొలిరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చురుకైన పాత్రపోషించాలని, అన్ని విభాగాల్లో సాధన కలిగి ఉండాలన్నారు. త్వరలో నూతన విద్యావిధానం పాలసీ అమలు కానుందని, అంగన్‌వాడీ సెంటర్లలో సైతం ఈ విధానం అమలు కానుందన్నారు. ఆడపిల్లలను రక్షించడం, చదివించడం ప్రధానంగా ఉండాలని తెలిపారు. కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించి అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి దిశలో నడపాలని సూచించారు. ఆయా శిక్షణా కేంద్రాల్లో శిక్షకులుగా షేక్ మస్తాన్‌బీ, చిన్నమ్మాయి, రాజ్యలక్ష్మి తదితరులు శిక్షణ ఇచ్చారు.

జాతీయ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి బాడ్మింటన్ పోటీలకు తిరుమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు గురువారం తెలిపారు. విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో కళాశాలకు చెందిన బోరుగడ్డ జాయ్‌కుమార్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. బెంగుళూరులో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో జాయ్‌కుమార్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. జాతీయ పోటీలకు ఎంపికైన జాయ్‌కుమార్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వైవీ నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

సంక్షిప్తం

• మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం వృద్ధి

నరసరావుపేట రూరల్: మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి పథంలో వెళ్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. కోటప్పకొండలోని డిఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం జిల్లా మహిళ సమైఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారితం ఎక్కువ ఉందని తెలిపారు. వ్యవసాయంలో పురుషునితో పాటు మహిళలకు కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్, వెలుగు, సిబ్బంది పాల్గొన్నారు.

• 64 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

శావల్యాపురం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 64 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ గత నవంబరులో మండలంలోని ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపులోపాల కల్గిన విద్యార్థులను గుర్తించి కళ్లజోళ్లు అందజేశారన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, కంటి వైద్య నిపుణులు డాక్టరు జ్ఞానసుందరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన కేసానుపల్లి సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన నడికుడి సాంబశివరావు(40) దాన్యం వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం చీరాల వెళ్లి శ్యాంపిల్స్ తీసుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. అర్ధరాత్రి 12.30గంటల సమయంలో కేసానుపల్లి సమీపంలో సాంబశివరావు నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన సాంబశివరావుపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

• వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా వాగులు, వంకలు, ఎన్ఎస్పీ కాలువను ఆక్రమించి రోడ్డు నిర్మాణం, గార్డెన్ ఏర్పాటుచేసిన విజయలక్ష్మి టౌన్‌షిప్, వేద మెడోస్ యజమానులైన పాలడుగు పుల్లారావు, గుండా సాంబశివరావు, అనిల్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో వీరి చర్యలను నిరసిస్తూ వాల్‌పోస్టర్లు ప్రదర్శించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• రేపు పీఎన్‌సీ కళాశాలలో ఉద్యోగ మేళా

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని పీఎన్‌సీ అండ్ కెఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15వతేదిన హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వూలు, ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్ గురువారం ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

• ఎన్ఎంఎంఎస్ కు ఇద్దరు ఎంపిక

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బీయం. సుభానీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన ఎన్ ఎంఎం ఎస్ పరీక్షలలో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుచున్న 10 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా పమ్మి వెంకటనాగచంద్రిక, ఒంటిపులి గీత ఎంపికైనారన్నారు. ఎన్ ఎంఎం ఎస్ కు ఎంపికైన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఐదు సంవత్సరాలు ఉపకారవేతనం వస్తుందన్నారు.

• నేటి నుంచి రంగస్థలి నాటిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, నరసరావుపేట రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీ నుంచి 16వతేదీ వరకు 24వ జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలి అధ్యక్షుడు షేక్.మహబూబ్ సుభానీ, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రబోస్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. టౌన్‌హాల్‌లో మూడురోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి నాటిక ప్రదర్శనలు ప్రారంభమవుతాయన్నారు. విలేకరుల సమావేశంలో రంగస్థలి గౌరవాధ్యక్షుడు కిలారు వెంకట్రావు, కోశాధికారి కనపర్తి సూరిబాబు, ఉపాధ్యక్షుడు కె.ఆర్.ప్రసన్న కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జంగాలపల్లె ఆలయాల వార్షికోత్సవం



నాదెండ్ల: జంగాలపల్లె గ్రామంలో కొలువైయున్న సీతారామాంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల నాలుగో వార్షికోత్సవం గురు వారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు వాసు, సురేష్‌లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, గోత్రనామ పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించి అనంతరం గ్రామోత్సవం చేశారు. హరే రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రీసర్వే పనుల్లో భాగస్వామ్యం తప్పనిసరి

తహసీల్దారు కె.సుజాత



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు కె.సుజాత

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దారు కె.సుజాత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కె.సుజాత మాట్లాడుతూ రైతుల సమక్షంలో రీసర్వే పనులు రోవర్ ఆధునీకరణ యంత్ర పరికరాలు చేయాలన్నారు. కొలతలు తీసే సమయంలో రైతులకు ముందుగా నోటీసులు అందజేసిన అనంతరం సందేహాలు నివృత్తి చేయాలన్నారు. సర్వే పనుల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్న, కొలతల్లో విస్తీర్ణం తేడాలు ఉంటే తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల భాగస్వామ్యంతో పనులు జరుగుతాయన్నారు. అనంతరం రీసర్వే జరుగుతున్న తీరుపై రైతుల అభిప్రాయసేకరణ తీసుకున్నారు. సర్వే డిప్యూటీ అధికారి పేరిసోముల నాసరయ్య, సర్వేయర్ యం.రాజు, వీఆర్వో ఉప్పులూరి చిన మంగయ్య, సర్వేయర్లు గురుబ్రహ్మం, సలీమ్, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ తగదు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బాజీ



నాదెండ్ల: వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటే సహించేది లేదని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ చెప్పారు. మండలంలోని తూబాడు గ్రామంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రవేశపెట్టడాన్ని యావత్తు ముస్లిం సమాజం ఖండిస్తుందన్నారు. తరతరాలుగా ముస్లిం వర్గానికి చెందిన ఆస్తులను ముస్లింలే నిర్వహించుకోవటం సబబని, ఇతరుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న నిర్ణయం సహేతుకంకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలతో వక్ఫ్‌బోర్డు హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో కలిశామని ఎన్నికల్లో ప్రకటన చేసిన కూటమి నాయకులు నేడు వక్ఫ్‌బోర్డు బిల్లుపై నోరు మెదపకపోవటం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలకు అనుకూలంగా నిలబడాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ముస్లింల మద్దతు కావాలంటే వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

విషరహిత ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ఎంపీడీవో సీతారామయ్య



ప్రకృతి వ్యవసాయం అవగాహన సదస్సులో అధికారులు

శావల్యాపురం: ప్రకృతి వ్యవసాయం సాగుకు మహిళా సభ్యులు ఆసక్తి చూపాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువు పురుగుమందుల అవశేషాలు వినియోగించని ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలన్నారు. 20 సెంట్లు భూమిలో ఆకుకూరలు, కూరగాయాలు, తదితరవన్నీ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయాలన్నారు. పచ్చిరొట్టె ఎరువుతో 30 రకాల విత్తనాలను కలిపి 365 రోజులు భూమిని కప్పి ఉంచేలాగా ఎకరానికి 25 కేజీల విత్తనాలను చల్లాలన్నారు. పొలాల్లో ఐదు రకాల అంతర పంటలకు కూరగాయలు బీరకాయ, బెండ గోరుచిక్కుడు, కంది, బంతి ఆముదం తదితర వాటిని సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఖరీఫ్ సాగు యాక్షన్ ప్లాన్‌పై (కెఏపీ) వివరించారు. అనంతరం మండలంలోని కారుమంచి, మతుకుమల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయాలు పూలు, దుంప జాతుల, స్టాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ శిక్షణా నిపుణులు వన్నెపు తిరుపతిరావు మండల యూనిట్ ఇన్‌చార్జ్ ఓర్సు లక్ష్మీదుర్గా, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఏపీయం జి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు



సుందరరావుకు కరపత్రాలు అందిస్తున్న రైతు సంఘ నాయకులు

నాదెండ్ల: ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటును పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు గణపవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావును కలిసి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల పూర్తి అవగాహనతో సమస్యల పరిష్కారానికి కృషి చేసే నేత కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగులు, కార్మికులు, కర్షకుల సమస్యలపై నిత్యం చట్టసభల్లో ప్రస్తావించే లక్ష్మణరావును గెలిపించుకోవటం అవసరమన్నారు. అనంతరం గ్రామంలో గ్రాడ్యుయేట్లను కలిసి ఎన్నికల పత్రాలు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు గద్దె చలమయ్య, కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు ఉన్నారు.

కాలువలను ఆక్రమించిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: ఎన్ఎస్పీ అధికారుల నుంచి ఎలాంటి ఎన్‌వోసీలు తీసుకోకుండా ములకలూరులోని విజయలక్ష్మి టౌన్‌షిప్‌లో కాలువలపై జరిపిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రజాసంఘాల నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మీ టౌన్‌షిప్ పేరుతో ములకలూరు, గోళ్లపాడు గ్రామాల మధ్య పలు వెంచర్లను వాగులు, పంట కాలువలు, ఎన్ఎస్పీ కాలువలు ఆక్రమించి ఏర్పాటు చేశారని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా వెంచర్లు వేసి వినియోగదారులను సంస్థ నిర్వాహకులు మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంస్థ భాగస్వామిగా ఉన్న పాలడుగు పుల్లారావు చిట్స్ డిపాజిట్‌ల పేరుతో పెద్ద ఎత్తున సంపదను పొగుచేసుకొని పరారయ్యాడని తెలిపారు. విజయలక్ష్మీ టౌన్‌షిప్ చేస్తున్న ఆక్రమణలు, మోసాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళిత గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలి

నరసరావుపేట: ఈ ఏడాదిలో వనరుల్లో వాటా నిర్ణయాధికారంలో దళిత గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలని ఏపీ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని నాలుగో తరగతి ఉద్యోగుల భవన మీటింగ్ హాలులో జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవకుమార్ మాట్లాడుతూ దళిత గిరిజనులు జనాభా ప్రాతిపదికను బడ్జెట్ కేటాయించి వారి నివాస ప్రాంతాలు, అభివృద్ధి కోసం ఉన్నటువంటి అవసరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా ఖర్చుచేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మేడే వెంకటరమణ, తోకల సాంబయ్య, కోటి రత్నం, ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.